క్లుప్తంగా

25న శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో వరలక్ష్మీవ్రతం



నందవరం చౌడేశ్వరిదేవి

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో ఈ నెల 25న వరలక్ష్మీవ్రతం నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్ బుధవారం తెలపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించే ఈ సామూహిక వరలక్ష్మీవ్రతంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం పొందాలని సూచించారు. వరలక్ష్మీ వ్రతం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఈఓ తెలిపారు.

రైతు భరోసా కేంద్రాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ సుధాకర్ రెడ్డి

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు, పెరుసోముల గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను ఏఓ సుధాకర్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన ఏఓ ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ ఎంత వరకు వచ్చిందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ మండలం మొత్తం 2,500 ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగు చేశారని, ఇప్పటి వరకు 1,000 ఎకరాలు ఈ క్రాప్ నమోదు చేశారన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ సిబ్బంది సురేంద్ర, చెన్నయ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేత



సరుకులు అందజేస్తున్న స్ఫూర్తి సభ్యులు

డోన్ టౌన్ : పట్టణంలోని కొండపేటలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న సుంకయ్య, లక్ష్మీదేవి వృద్ధ దంపతులకు బుధవారం స్ఫూర్తి సేవా సమితి సభ్యులు నిత్యావసర సరుకులు అందజేశారు. వృద్ధ దంపతుల ఆర్థిక ఇబ్బందులపై స్పందించిన రియల్ ఎస్టేట్ వ్యాపారి జయన్న ఆర్థిక సాయంతో బియ్యం బస్తా, నెలకు సరిపడ కిరాణం సరుకులు అందజేశామని స్ఫూర్తి వ్యవస్థాపకుడు సీసంగుంతల మధు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రాము, వెంకటేష్, బొందిమడుగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ రాజ్‌కుమార్



ప్యాపిలి: ప్యాపిలి ఎస్ఐగా రాజ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న సీఎం రాకేశ్ వీఆర్‌కు వెళ్లగా నంద్యాల ఫ్యాక్షన్ జోన్‌లో పని చేస్తున్న రాజ్‌కుమార్ ఇక్కడికి వచ్చారు. నేరాల నియంత్రణకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎస్ఐ తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించమని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

డోన్ టౌన్ : మండల పరిధిలోని యు.కొత్తపల్లెలో విక్రయిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సెబ్ సీఐ భీమలింగ తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం నిందితుల్లో ఒకరిని అరెస్టు చూపారు. కర్ణాటక మద్యం అమ్ముతున్న సమాచారం మేరకు దాడి చేసి గ్రామానికి చెందిన షేక్ నడిపి హుస్సేన్ పీరాను అదుపులోకి తీసుకుని అతని ఇంటిలో సోదా చేశామన్నారు. ఓరిజినల్ చాయిస్ 384 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇతనికి మద్యాన్ని సరఫరా చేసిన ఈడిగ పాండురంగడును నిందితునిగా చేర్చి ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. త్వరలో పాండు రంగడుని అరెస్టు చేస్తామన్నారు.

'వంద సూత్రాలు' పుస్తకాల పంపిణీ

బనగానపల్లెరూరల్: మండలంలోని పలుకూరు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తర గతి విద్యార్థులకు యండమూరి రవీంద్రనాథ్ రచించిన మొదటి ర్యాంకు సాధించేందుకు వంద సూత్రాలు అనే పుస్తకాలను హెచ్ఎం గౌరిశంకర్‌తో కలిసి జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఎస్ఎస్ బ్రహ్మానందఆచారి ఉచితంగా బ్రహ్మానంద ఆచారి పంపిణీ చేశారు. విద్యావారధి ఫౌండేషన్ సహకారంతో ఈ పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేసినట్లు బ్రహ్మానంద ఆచారి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, శ్రీనివాసు లు, సుస్మిత, రామసుబ్బయ్య తదతరులు పాల్గొన్నారు.

విద్యా బోధన...కొత్త ఒరవడి!

- ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



డిజిటల్ క్లాస్‌తో పదో తరగతి విద్యార్థులు



మోడల్ స్కూల్‌లో ఐఎఫ్‌పీ ద్వారా బోధిస్తున్న ఉపాధ్యాయుడు చారీస్

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ విద్యారంగంలో విప్లవాత్మకమార్పులు తీసుకొచ్చింది. నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేసింది. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మౌలిక వసుతుల కల్పించిన వైఎస్సార్‌సీపీ సర్కార్ ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుంచే స్మార్ట్ క్లాస్ రూములు అందుబాటులోకి తెచ్చింది. డిజిటల్ విప్లవంతో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాణిస్తున్నారు. దశల వారీగా సర్కార్ బళ్లు డిజిటల్ మయం అవుతున్నాయి. ఇన్నాళ్లు బ్లాక్ బోర్డులపైన సాగిన బోధన పెద్ద పెద్ద స్మార్ట్‌టీవీల్లో ప్రారంభమైంది. విద్యార్థుల సామర్థ్యాల పెంపే లక్ష్యంగా ఈవిద్యాసంవత్సరం నుంచే వినూత్నమైన డిజిటల్ బోధనను అందుబాటులోకి తీసుకొచ్చింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ప్రపంచ స్థాయిలో మన విద్యార్థులు పోటీ పడాలంటే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోనే సాధ్యమవుతుందంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ విప్లవానికి నాంది పలికారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ వెలుగులు నిండాయి.

డిజిటల్ తరగతులు ప్రారంభం

నియోజకవర్గ బనగానపల్లెతోపాటు కొలిమిగుండ్ల, అవుకు, సంజామల, కోవెలకుంట్ల మండలాల్లో 128 ఐఎఫ్‌పీలు, 139 స్మార్ట్ టీవీలను ఫస్ట్ ఫేజ్ కింద మంజూరు చేసింది ప్రభుత్వం. ప్రస్తుతం వీటిని ఆయా పాఠశాలలో ఏర్పాటు చేసి, ఇంటర్నెట్ కనెక్షన్ ఇవ్వడంతో ఉపాధ్యాయులు డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్‌పీలు)లను ఎలా ఉపయోగించాలనే వాటిపై ఇదివరకే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చిన విషయం తెలిసిందే.

విద్యార్థులకు ఉపయోగాలు ఇలా:

బైజూస్‌తో టైఅప్ అయి మ్యాడ్యూల్‌ను విద్యార్థులకు ట్యాబ్‌ల రూపంలో అందించినప్పటికీ తరగతిలో ఉపాధ్యాయుని సమక్షంలో పాఠ్యాంశాలను దృశ్య వీక్షణ ద్వారా చూడటం విద్యార్థులకు గొప్ప అనుభూతిని ఇస్తుంది. విద్యాబోధనలో అవసరమైన ప్రయోగాల కల్పన నేరుగా స్క్రీన్‌పై విద్యార్థులు చూసేందుకు వీలుంటుంది. బ్లాక్ బోర్డు తరహాలో స్క్రీన్‌పై వివిధ రకాల రంగుల్లో వాడుకోవచ్చు. రాసిన దానిని చేరపవచ్చు. రాసిన పాఠ్యాంశాలను సేవ్ చేసుకోవచ్చు కూడా. విద్యార్థులు గైర్హాజరైనా పాఠ్యాంశాలు సేవ్ చేసి ఉంటాయి కాబట్టి మరుసటి రోజు ఐఎఫ్‌పీలో వినే అవకాశం ఉంటుంది. యూట్యూబ్, ఫోన్ లేదా ట్యాబ్‌లోని సమాచారం సైతం స్క్రీన్‌పై చూసే వీలు ఉంటుంది. ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను విద్యార్థుల సెల్‌ఫోన్‌లకు వాట్సాప్ ద్వారా సెండ్ చేసే అవకాశం ఉంది.

సమయం ఆదా...

ఉపాధ్యాయులు బోధించేందుకు ప్రతి సబ్జెక్ట్‌క 45 నిమిషాలు మాత్రమే ఉంటుంది. ప్రత్యేకించి లెక్కలు, సైన్స్ పాఠ్యాంశాలు చెప్పే సమయంలో ఉపాధ్యాయలు బ్లాక్ బోర్డుపై చాక్‌పీస్‌తో రాసి, బొమ్మలు వేయంతోనే సమయం ముగుస్తుంది. ప్రస్తుతం డిజిటల్ క్లాస్‌లు వచ్చాక ఆపరిస్థితి లేదు. కేవలం క్లిక్‌తోనే వివిధ రంగుల్లో స్క్రీన్‌పై బొమ్మలు ప్రత్యక్ష్యమవుతున్నాయి. విద్యార్థులకు సందేహాలు ఉంటే వెంటనే బోర్డుపై ప్రదర్శించి నివృత్తి చేస్తున్నారు. పలు దేశాల మ్యాప్‌లు, సైన్స్, గణితం సబ్జెక్ట్‌లతో పాటు తెలుగు పాఠ్యాంశాలకు సంబధించి పద్యాలు సైతం వాయిస్ రూపంలో విద్యార్థులు వినవచ్చు. దీంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బాగా అర్థం అవుతున్నాయి



పాఠశాలలో ఇటీవలనే ప్రతి తరగతి గదిలో ఐఎఫ్‌సీలు ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయలు స్క్రీన్‌పై చెబుతున్న పాఠాలు బాగా అర్థమవుతున్నాయి. గతంలో బ్లాక్ బోర్డుపై చాక్‌పీస్‌తో రాసే సమయంలో కొన్ని సందర్భాల్లో అర్థం అయ్యేవి కావు. ఇప్పుడు రకరకాల రంగుల్లో బొమ్మలను కూడా చూపించి అర్థం అయ్యేలా ఉపాధ్యాయులు వివరిస్తున్నారు. నిజంగా చెప్పాలంటే కార్పొరేట్ స్కూల్‌లో చదువుతున్న అనుభూతి కలుగుతుంది. – నవిత,విద్యార్థి

మంచి ఫలితాలు సాధిస్తారు



సాంకేతికతను జోడించి విద్యాబోధన చేయడంతో విద్యార్థులు భవిష్యత్‌లో మంచి ఫలితాలు సాధిస్తారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యాభ్యాసాన్ని సొంతం చేసుకునే అవకాశం వచ్చింది. తరగతి గదిలోనే డిజిటల్ ప్రపంచం ఏర్పడింది. విద్యార్థుల్లో సృజన బయట పడుతుంది. విద్యార్థులు దృశ్య, శ్రవణ రూపంలో చక్కగా పాఠాలు వినే అవకాశం ఉంది. డిజిటల్ విద్యాబోధన విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకు తృప్తినిస్తుంది. – చంద్రసేనారెడ్డి, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్

జ్ఞాపకాలు 'సజీవం'



దివంగత మర్రి శ్రీదేవి మైనపు ప్రతిమ

రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల ఆర్థిక సంస్థ డైరెక్టర్(ఏపీఐఐసీ) మర్రి గోవిందరాజులు సతీమణి దివంగత శ్రీదేవి మైనపు బొమ్మ పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈమె ఇటీవల ఆకస్మికంగా మరణించారు. వీరి ఏకైక కుమారుడు మర్రి సిద్ధార్థ్‌శ్రేయస్ వివాహం గురువారం జరగనుంది. ఈ నేపథ్యంలో ఆమెపై ఉన్న ప్రేమతో మైనపు బొమ్మను తయారుచేయించి పెళ్లి మండపంలో ఉంచారు. శ్రీదేవి సజీవంగా ఉన్నారన్నట్లుగా మైనపు బొమ్మ ఉండడంతో వివాహానికి వచ్చిన వారంతా పక్కన నిల్చొని ఫొటోలు దిగుతుండటం విశేషం. మైనపుబొమ్మను గుంటూరు పట్టణంలో తయారు చేయించినట్లు గోవిందరాజులు బంధువులు తెలిపారు. – డోన్

ఉపాధి పనుల్లో అక్రమాలకు తావివ్వొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ రామచంద్రారెడ్డి

బేతంచెర్ల: ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలకు తావు లేకుండా, అర్హులైన వారందరికీ పనులు కల్పించాలని నంద్యాల జిల్లా పీడీ రామ చంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలో 2022 ఏప్రిల్ 1నుంచి 2023 మార్చి 31వరకు జరిగన ఉపాధి పనులకు సంబంధించి 17విడత సామాజిక తనిఖీ బృందం ఎస్ఆర్‌పీ నీలకంఠం ఆధ్వర్యంలో ఎంపీడీఓ వెంగన్న అధ్యక్షతన సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. గ్రామాల వారీగా డీఆర్‌పీలు నివేదికలు వినిపించారు. ముఖ్యంగా మస్టర్లలో కొట్టి వేతలు, హాజరైన కూలీల సంతకాలు లేకుండా వేతనాలు చెల్లించినందున రూ.41,090 రికవరీకి ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్స్ రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో రూ.8,500 జరిమానా విధించారు. పూడిక తీత పనుల్లో కొలతలు సక్రమంగా లేవని, సరి చేయాలని ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లను పీడీ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు పీడీ సలీం బాషా, ఏపీడీలు బాలజీ నాయక్, శ్రీ విద్య, ఏఓ దస్తగిరి బాబు, ఏపీఓ శేషన్న, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగేంద్ర



సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన నాగేంద్రను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోవెలకుంట్ల: మండలంలోని జోళదరాశి గ్రామ సర్పంచ్‌గా ఈర్నపాటి ఉప్పరి నాగేంద్ర బుధవారం నుంచి బాధ్యతలు చేపట్టారు. సర్పంచ్‌గా ఎన్నికైన భాగ్యలక్ష్మి అనారోగ్య పరిస్థితుల కారణంగా దీర్ఘకాలిక సెలవుపెట్టారు. దీంతో ఉపసర్పంచ్ నాగేంద్రకు జిల్లా పంచాయతీ అధికారులు సర్పంచ్ బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పోతం రాంమోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఉప్పరి సుబ్బరాయుడు, రఘునాథరెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, గువ్వల రామకృష్ణారెడ్డి, గ్రామ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి షఫీవుల్లా తదితరులు సర్పంచ్‌ను ఆయనను ఘనంగా సత్కరించారు.

అధిక దిగుబడులకు ప్రకృతి వ్యవసాయమే మార్గం



మహిళా రైతులకు విత్తనాల కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి

డోన్ : అధిక దిగుబడి సాధనకు, చీడపీడల నివారణకు ప్రకృతి వ్యవసాయమే సరైన మార్గమని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. డోన్ మండల మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహిళా రైతులకు 30 మేలిరకం విత్తనాల కిట్లను వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అశోక్‌వర్ధన్‌రెడ్డితో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సాగు పెట్టుబడులు పెరుగుతున్నా దిగుబడులు గిట్టుబాటు కావడంలేదన్నారు. పూర్వం సహజసిద్ధమైన ఎరువు పశువుల పేడను వినియోగించడం ఎంతో ఉపయోగకరమన్నారు. మితిమీరిన రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల మూలంగా భూసారం తగ్గడమే కాకుండా అంతుపట్టని తెగుళ్ల సోకుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు అనేక ప్రోత్సాహకాలను అందజేస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ షఫీ, వ్యవసాయ సలహామండలి చైర్మన్ చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు అన్నిరంగాల్లో రాణించాలి



ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

బేతంచెర్ల: ఆర్యవైశ్యులు వ్యాపారాలతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జాతీయ కోఆర్డినేటర్ ఇల్లూరు లక్ష్మయ్య, కర్నూలు, నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, టంగుటూరి శీనయ్య పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని అమ్మవారిశాలల్లో 2023–24, 25 సంవత్సరం ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులు కంద గడ్డల మోహన్ రావు, గురవయ్య, కోశాధికారి గుండా జయచంద్ర, అదనపు ప్రధాన కార్యదర్శి కొప్పరపు శేషా మోహన్, గౌరవ సలహాదారులు రామమూర్తి, ఉపాధ్యక్షులు బైసాని శేషఫణి, చిన్న ఎల్లరామయ్య, గుండా జగన్ మోహన్‌రావు, విష్ణు, వెంకట శెట్టి, మల్లికార్జున కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గం సభ్యులు ఆర్యవైశ్య సంఘం అభివృద్ధితో పాటు సమాజసేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని ఈసందర్భంగా వారు సూచించారు. కార్యక్రమంలో నాయకులు గుండా గోపాలు, బచ్చు సుబ్రహ్మణ్యం, సముద్రాల మద్దిలేటిస్వామి తదితరులు పాల్గొన్నారు.

దేశ కీర్తిని చాటిన చంద్రయాన్ -3

డోన్ టౌన్ : ప్రపంచ నలుమూలల భారతదేశ కీర్తిని ఇస్రో శాస్త్రవేత్తలు చాటారని పలువురు ప్రశంసించారు. బుధవారం సాయంత్రం చంద్రయాన్–3 విజయవంతంపై హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి. పాఠశాలల్లో విద్యార్థులు వీక్షించారు. అదేవిధంగా ప్రజలు సైతం టీవీలో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా పాతపేట ప్రభుత్వ హైస్కూల్లో విద్యార్థులు ఇస్రో అక్షరాలుగా కూర్చుని సంఘీభావం తెలిపారు. హెచ్ఎం పద్మావతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు జాతీయ జెండాను చేతబూని శాస్త్రవేత్తలకు అనుకూలంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. పలువులరు బాణా సంచా కాలుస్తూ ఇండియా జిందాబాద్... ఇస్రో సూపర్ అంటూ నినాదాలు చేశారు.

బేతంచెర్ల: చంద్రయాన్ -3 ల్యాండింగ్ విజయవంతం కావడంతో మండల కేంద్రమైన బేతంచెర్ల పట్టణంతో పాటు గ్రామాల్లో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ బీసీ గురుకుల విద్యాలయంలో విద్యార్థులు ప్రత్యక్షంగా చంద్రయాన్ -3 ల్యాండింగ్ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ శివ ఆధ్వర్యంలో వీక్షించారు. విద్యార్థులు చంద్రయాన్ -3 ల్యాండింగ్ కాగనే చప్పట్లు కొడుతూ సంబరాలు చేసుకున్నారు.

ప్యాపిలి: చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతం కావడంపై ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. బుధవారం సాయంత్రం 6.04 నిమిషాలకు చంద్రుని దక్షిణ ధృవంపై విక్రం ల్యాండ్ అయ్యే సన్నివేశాన్ని ప్రజలు టీవీల ముందు కూర్చుని ఆసక్తిగా వీక్షించారు.

జేసీని కలిసిన జెడ్పీ చైర్మన్



జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డికి బొకె అందజేస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డిని బుధవారం జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని జేసీ చాంబర్‌లో కలిసి బొకె అందజేశారు. ఇటీవలనే జేసీగా బాధ్యతలు స్వీకరించడంతో శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధి, సమస్యలు తదితర అంశాలపై జేసీతో జెడ్పీ చైర్మన్ చర్చించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : జగదుర్తి సబ్ స్టేషన్ పరిధిలో రూరల్ ఫీడర్ కింద ఉన్న 11కేవీ లైన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో గురువారం కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలో ని జగదుర్తి, ఉడుములపాడు, గుంటుపల్లి, సోంపు రం, తాటిమానుకోత్తూరు, అమకదాడు గ్రామాల కు ఉదయం 11 నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయానికి సంబంధించి రాత్రి 2 నుంచి ఉదయం 11గంటల వరకు సరఫరా చేస్తామని ఏఈ వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ప్రత్యేక ఆధార్ క్యాంప్

సంజామల: మండల పరిధిలో కానాల, ఆకుమల్ల గ్రామాల సచివాలయంలో గురువారం ప్రత్యేక ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగకుమార్ బుధవారం తెలిపారు. ఈ క్యాంపులో కొత్తగా ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఒక్కరోజు జరిగే ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ను ఆయా గ్రామాల సచివాలయ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

కోవెలకుంట్ల: పట్టణంలోని బనగానపల్లె చౌరస్తా క్రాస్ రోడ్‌లో గురువారం నుంచి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో గణపతిపూజ, పుణ్యాహవచనం, దీక్షా హోమాలు ఉంటాయన్నారు. చివరిరోజు 26వ తేదీన యంత్ర అభిషేకం, ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమాలకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి తదితర ప్రముఖులు హాజరవుతున్నట్లు వారు వివరించారు.

నేడు మండల మీట్

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈకార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరవుతారన్నారు. వివిధ శాఖల అధికారులతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



రైతులకు చిరుధాన్యాల విత్తన కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్యాపిలి: ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, ఏపీ ఐబీసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఐసీఆర్‌పీలు, వీఏఏలకు ప్రకృతి వ్యవసాయంపై డీపీఎం నరేంద్రరెడ్డి, అడిషనల్ డీపీఎం అబ్దుల్ సలాం అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మోతాదుకు మించి రసాయనిక ఎరువులను వాడుతున్నందున భూసారం క్షీణించడంతో పాటు చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుందన్నారు. ఇప్పటి నుంచైనా పకృతి వ్యవసాయం పాటించాలని సూచించారు. రైతులకు చిరుధాన్యాల విత్తన కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రాజేశ్, ఏపీఎం కృష్ణమూర్తి, ఎస్ఎఫ్ఏ ఇంచార్జ్ భీమేశ్, ఎస్పీఏ చెన్నప్ప, ఊటకొండ ఎంపీటీసీ మద్దయ్య యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, మాస్టర్ ట్రైనర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డోన్ చేరిన విద్యార్థి సంగ్రామ బైకు యాత్ర



బహిరంగ సభలో మాట్లాడుతున్న దక్క కుమార్

డోన్ టౌన్ : సమగ్ర విద్యాభివృద్ధి లక్ష్యంగా ప్యాపిలి మండలం పోతుదొడ్డి గ్రామం నుంచి ఎస్ఎఫ్ఐ నాయకులు చేపట్టిన విద్యార్థి సంగ్రామ బైకుయాత్ర బుధవారం డోన్‌కు చేరింది. ఈ సందర్భంగా పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దక్క కుమార్, నిరంజన్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వమే పాఠ్యపుస్తకాలను అందించాలని, సంక్షేమ వసతి గృహాలను నాడు నేడు కింద అభివృద్ధి చేయాలని, ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు మహబూబ్ బాషా, ఇర్ఫానాబేగం, అశోక్, షమీమ్‌బేగం, నక్కి శ్రీకాంత్, శివరాం, రామాంజనేయులు, అమృత, మాదేవి, హరి, అబీబ్‌బాషా, రామలింగం, సురేష్, మల్లికార్జున, మహేంద్ర, శివ, శ్రీనివాసులు, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అభినందనీయం



నగదు అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవడం అభినందనీయం అని డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గిరి కుటుంబానికి బుధవారం ట్రాక్టర్స్ అండ్ జేసీబీ ఓనర్ల అసోషియేషన్ ఆధ్వర్యంలో సేకరించిన రూ.1.80 లక్షలను బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బాధితుడి కుటంబానికి వారు అందజేశారు. ఈ నెల 12న బైకుపై వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో వైఎస్ నగర్‌కు చెందిన జేసీబీ డ్రైవర్ గిరి మృతి చెందగా భార్య నేటికీ కోమాలో ఉంది. ఈ కుటుంబానికి తమవంతుగా ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో న్యాయవాది నాగభూషణంరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ట్రాక్టర్, జేసీబీ యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

క్యాంటిన్‌లో తక్కువ ధరకే భోజన వసతి



డోన్ పాతబస్టాండ్‌లో క్యాంటీన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

డోన్ : పట్టణంలోని పాతబస్టాండ్ సంతమార్కెట్ వద్ద తక్కువ ధరకే పేదలకు భోజనం అందించే ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో పాతబస్టాండ్‌లో క్యాంటీన్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని మెప్మా అధికారి సుజాత ఆధ్వర్యంలో బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ డోన్ రైల్వే జంక్షన్‌తో పాటు బస్సుల్లో వేలాది మంది డోన్ నుండి రాకపోకలు సాగిస్తుంటారని, వివిధ పనుల నిమిత్తం సామాన్య, మధ్యతరగతి ప్రజలు పట్టణానికి వచ్చి వెళ్తుంటారన్నారన్నారు. ఇలాంటి వారికోసం కేవలం రూ.40కే భోజన సౌకర్యాన్ని కల్పించే ఆలోచన చేస్తున్నామని చెప్పారు. టీఎల్ఎఫ్ గ్రూపుల ద్వారా ఆసుపత్రులు, పాత, కొత్త ఆర్‌టీసీ బస్టాండ్‌లు, రైల్వే జంక్షన్ లాంటి ప్రాంతాల్లో కూడా క్యాంటీన్లను ఏర్పాటు చేసి సరసమైన ధరలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే ఈ కార్యక్రమం ప్రారంభిస్తామని ఆయన వివరించారు.

ప్రకాశం పంతులు జయంతి



పాతపేట హైస్కూల్లో ఆంధ్ర కేసరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్ : దివంగత ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతుల జయంతిని పురస్కరించుకుని పాతపేట ప్రభుత్వ హైస్కూల్లో బుధవారం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర కేసరి సేవలను ఈ సందర్భంగా హెచ్ఎం పద్మావతి గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, శివప్రసాద్, వెంకటరమణ, లక్ష్మయ్య, భారతి, లక్ష్మీప్రభావతి, హుస్సేన్‌ఖాను తదితరులు పాల్గొన్నారు.

– పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్స్‌పాల్ కృష్ణయ్య ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతుల జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మమ్మద్ రఫీ, అధ్యాపకులు చంద్రమోహన్, శ్రీనివాసరెడ్డి, చౌడప్ప, చాంద్‌బాషా, అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు సేవలు చిరస్మరణీయం

ప్యాపిలి: టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు చిరస్మరణీయం అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక కళాశాలలో బుధవారం టంగుటూరి ప్రకాశం జయంతి నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నవీన పాటి, లెక్చరర్లు రామకృష్ణయ్య, సత్యబాబు, నవీన్, ఓబులేసు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.